# హెచ్‌సీయూకు ఎసరు?

- హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీని తరలించే కుట్ర
- ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయం
- భవనాల నిర్మాణం కోసం వెయ్యి కోట్లు అంచనా
- ముగ్గురు ఉన్నతాధికారుల సమన్వయంతో కసరత్తు
- మంత్రుల కమిటీ గ్రీన్ సిగ్నల్.. సీఎం వద్దకు ప్రణాళిక
- పార్కులను తనఖా పెట్టి రుణాలు పొందే కుయుక్తులు



హెచ్‌సీయూలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): తొలి తెలంగాణ ఉద్యమ ఫలంగా అంది వచ్చిన 'హెచ్‌సీయూ'ని నగరం దాటించేందుకు కుట్రలు మొదలయ్యాయా? ఆనాడు 370 మంది విద్యార్థుల రక్త తర్పణానికి జడిసిన ఇందిరమ్మ, తొలి శాంతి ప్రయత్నంలో భాగంగా కంచ గచ్చిబౌలిలో ఏర్పాటు చేసిన 2వేలకు పైగా ఎకరాల వర్సిటీని రేవంత్‌రెడ్డి సింగిల్ పెన్ స్ట్రోక్‌తో ఫ్యూచర్ సిటీకి తరలిస్తున్నారా? 400 ఎకరాల కోసం నేడు హెచ్‌సీయూ విద్యార్థులు ఉద్యమాలు చేస్తుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం వారిని ఏమార్చి అసలుకే ఎసరు పెట్టే ఎత్తుగడ వేసిందా? ఈ ప్రశ్నలకు 'ఔను' అన్న సమాధానమే వినిపిస్తున్నది. వర్సిటీని తరలించటం వ్యయప్రయాసలతో కూడుకున్నదే అయినా.. ఆ భూములను అమ్మితే వచ్చే రాబడి ముందు అదేం పెద్ద సమస్యే కాదని పాలకులు అంచనాకు వచ్చినట్టు విశ్వసనీయంగా తెలిసింది. సాధ్యమైనంత వేగంగా ఫ్యూచర్ సిటీలో వర్సిటీకి 100 ఎకరాలు, క్యాంపస్ భవనాల నిర్మాణం కోసం రూ.1,000 కోట్లు ఇచ్చేందుకు రేవంత్ సర్కారు ప్రణాళికలు రూపొందించినట్టు సచివాలయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి, అటవీ శాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీం, సీఎం ముఖ్య కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఉదయం సచివాలయంలో సమావేశమై వర్సిటీ తరలింపు ప్రణాళికపై కసరత్తు చేసినట్టు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. అందులో భాగంగానే దేశంలోనే అతిపెద్ద ఎకో పార్క్ అనే అంశాన్ని తెర మీదకు తెచ్చారని, సుప్రీంకోర్టు అడిగిన వివరాలకు తగిన జవాబు ఇస్తూనే..అదే అఫిడవిట్‌లో ప్రతిపాదిత ఎకో పార్కు ప్రణాళికను కూడా సమర్పించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు సమాచారం. ఈ ప్రతిపాదనలకు మంత్రుల కమిటీ సభ్యులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, పొంగులేటి గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో శనివారం మరికొన్ని మెరుగులతో సీఎం రేవంత్‌రెడ్డికి తుది ప్రణాళిక సమర్పించినట్టు తెలిసింది.

### ఇదే పాయింట్ ఎత్తుకుందాం!

యూనివర్సిటీలకు ఎంత భూమి అయితే సరిపోతుందనే అంశం మీద దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో, తెలంగాణ ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టులో ఇదే అంశం మీద నిర్దిష్టమైన వాదనలు వినిపించాలని నిర్ణయించినట్టు తెలిసింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ దాదాపు 2000 ఎకరాల్లో ఉన్నదని, ఇందులో మహా అయితే ఓ 10-15 ఎకరాల్లో క్యాంపస్.. అడ్మినిస్ట్రేషన్ కార్యాలయాలు ఉంటాయి. మిగతాదంతా లంగ్ స్పేస్ అని, చిట్టడవిలా ఉంటుందని సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించినట్టు తెలిసింది. అప్పట్లో కావాల్సినంత భూమి అందుబాటులో ఉంది కాబట్టి, వర్సిటీకి వేల ఎకరాలు కేటాయించారని, కానీ ఇప్పుడదంతా నిరుపయోగమేనని, 50 ఎకరాల్లో సెంట్రల్ వర్సిటీ సరిపోతుందనే వాదనలు వినిపించాలని భావిస్తున్నట్టు తెలిసింది. వర్సిటీని అక్కడి నుంచి ఫ్యూచర్‌సిటీకి తరలించి, కంచ గచ్చిబౌలిలోని 2 వేల ఎకరాల్లో ఎకో పార్క్ నిర్మించాలన్న ప్రతిపాదనను కూడా న్యాయస్థానం ముందు పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్టు తెలుస్తున్నది. విభిన్న వృక్షాలను నాటడం, వాకింగ్ ట్రాక్, సైక్లింగ్ ట్రాక్, బర్డ్ పార్క్, సీతాకోకచిలుకల గార్డెన్, తాబేళ్ల పార్క్, రాక్ గార్డెన్, ఓపెన్-ఎయిర్ జిమ్‌ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించినట్టు తెలిసింది. ఫ్యూచర్ సిటీలో 100 ఎకరాల పరిహారంతో పాటు, క్యాంపస్ నిర్మాణం, తరగతి గదులు, అడ్మినిస్ట్రేషన్ భవనాల నిర్మాణాల కోసం రూ.1000 కోట్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సంసిద్ధతను వ్యక్త పరచాలని నిర్ణయించినట్టు తెలిసింది.

### తనఖా పెట్టేందుకే ఏమార్చే ఎత్తులు!

నాడు హెచ్‌సీయూకు కేటాయించిన 2,324 ఎకరాల్లో కొంత అన్యాక్రాంతమైనట్టు అధికారులు గుర్తించినట్టు తెలిసింది. పోయిన భూమి పోగా మిగిలిన 2000 ఎకరాలను ఒక దగ్గరకు తెచ్చి ముందుగా ఎకో పార్కుగా మార్చితే ప్రజల దృష్టి మళ్లుతుందని ప్రభుత్వం భావిస్తున్నది. అనంతరం నగరం చుట్టూ ఉన్న ఎకో పార్కులను ఒకే గొడుగు కిందికి తెచ్చి కార్పొరేషన్ ఏర్పాటు చేసి, పార్కులను తనఖా పెట్టడం ద్వారా బ్యాంకు రుణాలు పొందవచ్చనే ఆలోచన చేసినట్టు సెక్రటేరియట్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఏటికి ఎదురీది 400 ఎకరాలను అమ్మిన దానికంటే, ఎకో పార్కులను కొల్లేటరల్ గ్యారెంటీగా పెట్టడం ద్వారా మరింత సొమ్ము రాబట్టవచ్చని ప్రభుత్వం ఆలోచన చేసినట్టు ప్రచారం జరుగుతున్నది..

### నాటి ఉద్యమంతో హెచ్‌సీయూ పునాది..

1969 జనవరి మొదటి వారంలో ప్రారంభమైన తెలంగాణ తొలి ఉద్యమం జనవరి 19 నాటికి తీవ్ర తరమైంది. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు ప్రత్యక్ష ఉద్యమంలోకి వచ్చారు. ఉద్యమ రూపం క్రమంగా హింసాత్మకంగా మారింది. ఈ పోరాటంలో 370 మంది విద్యార్థులు పోలీస్ కాల్పులకు బలయ్యారు. అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జోక్యం చేసుకొని 1969 ఏప్రిల్‌లో తెలంగాణ ప్రజల సమస్యల పరిష్కారానికి ఐదు ఉన్నత స్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షతో రగిలిపోతున్న విద్యార్థులను బుజ్జగించేందుకు 1973 సిక్స్ పాయింట్ ఫార్ములాలో భాగంగా హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీని తెర మీదికి తెచ్చారు. 1974లో యూనివర్సిటీని స్థాపించారు. తొలినాళ్లలో అబిడ్స్‌లోని సరోజినీ నాయుడు నివాసం, గోల్డెన్ థ్రెషోల్డ్ భవనంలో తరగతులు నిర్వహించేవారు. 1975లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జలగం వెంగళ్‌రావు ప్రభుత్వం కంచ గచ్చిబౌలిలోని 2,324 ఎకరాల భూమిని యూనివర్సిటీకి కేటాయించింది.



హెచ్‌సీయూ వద్ద కుక్కల దాడిలో మృతి చెందిన జింక పిల్ల, రెండు ముక్కలుగా మారిన దృశ్యం

# బతుకువేటలో మరో జింక బలి

- గుట్టకొకటి పుట్టకొకటిగా మూగజీవాల పరుగులు
- దయనీయంగా జింకల మరణం
- శనివారం మరో జింక కూన మృతి
- సుప్రీం ఆదేశాలకు విరుద్ధంగా సీఎం రేవంత్‌రెడ్డి 'ఏఐ' వ్యాఖ్య

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): హెచ్‌సీయూలో సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు సాగించిన విధ్వంసపు ఆనవాళ్లు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. బుల్డోజర్లు దూసుకువస్తుంటే మూగజీవాలకు అంతుపట్టలేదు. గుట్టకొకటి, పుట్టకొకటిగా పరుగులు తీశాయి. వంద ఎకరాల వనం... మైదానమైపోయింది. తమ ఆవాసాల ఆనవాళ్లు కూడా కనిపించకపోవడంతో హరిణాల వేదన అరణ్య రోదనగానే మిగిలిపోయింది. ప్రాణాలు కాపాడుకునేందుకు సాగించిన పరుగులో కుక్కల దాడిలో జింకలు ప్రాణాలు విడిచిపెట్టాల్సి వస్తున్నది.

### జింక కూన ప్రాణం తీసిన కుక్కలు!

ఇదిగో ఈ కూన జింకను ఒక్కసారి చూడండి. రెండుగా చీలిన ఆ దేహాన్ని కండ్లారా చూడండి. ఎంత వేదన అనుభవించి ఆ జీవి తన ప్రాణాలను వదిలిందో కదా! బుల్డోజర్ల కింద వాటి గూడు నలిగిపోతే.. ఈ కూన ప్రాణభయంతో పరుగుపెట్టింది. కుక్కలు ఆ జింకపై దాడి చేశాయి. ఒళ్లు గగుర్పొడిచేల ఆ కూనను తీవ్రంగా కరిచాయి. దేహాన్ని రెండుగా చీల్చాయి. ఈ దాడిలో కూన అక్కడికక్కడే మరణించింది. ఈ విషాదం శనివారం హెచ్‌సీయూలో బయటపడింది. రెండుగా చీలి ఉన్న జింక దేహాన్ని చూసిన వారందరి గుండె తరుక్కుపోతున్నది. కూన మృతదేహాన్ని యూనివర్సిటీ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఇంకా ఎన్ని మూగజీవాల ప్రాణాలు పోవాలని పర్యావరణ, జంతు ప్రేమికులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

### సర్కార్ మరో విధ్వంస రచన!

వెలకట్టలేని పచ్చదనాన్ని నేలకూల్చిన ప్రభుత్వం అదంతా ఒట్టిదేనని అంటున్నది. అంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సృష్టి అంటూ సీఎం రేవంత్‌రెడ్డి కొత్త వాదన తెరపైకి తీసుకొచ్చారు. కానీ హైకోర్టు రిజిస్ట్రార్ స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వందల బుల్డోజర్లతో వేలాది చెట్లను నేలకూల్చి, మూగజీవాలను చెల్లాచెదురు చేసిన వైనాన్ని నివేదిక రూపంలో సుప్రీంకోర్టుకు సమర్పించారు. అంటే రిజిస్ట్రార్ నివేదికను సైతం తప్పుపట్టే రీతిలో సీఎం ప్రకటన ఉండటంపై విమర్శలు వస్తున్నాయి. మరోవైపు హెచ్‌సీయూలో కుక్కల దాడిలో జింకలు చనిపోవడటం కొత్తేమీ కాదని... ఏటా 30-40 జింకలు చనిపోతాయని ప్రభుత్వ, కాంగ్రెస్ అనుకూల సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతున్నది. గతంలోని పత్రికల క్లిప్పింగులను వైరల్ చేస్తున్నారు. ఇదంతా సెల్ఫ్‌గోల్ అని హెచ్‌సీయూ విద్యార్థులు చెప్తున్నారు. అంటే 400 ఎకరాల పరిధిలో జింకలు ఉన్నాయని వారే అంగీకరిస్తున్నారని, కానీ అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం జింకలేవీ లేవు... గుంటనక్కలు ఉన్నాయని వ్యాఖ్యానించిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు.

# ప్రభుత్వం పరువు తీసుకోవద్దు

- సీఎం, మంత్రుల నోళ్లు అదుపులో ఉండాలి
- సుప్రీం ఆదేశాల మేరకు నడుచుకోవాలి
- హెచ్‌సీయూ విద్యార్థుల పోరాటం వెనుక ఎవరో ఉన్నారనడం మూర్ఖత్వం
- ప్రజా సంఘాల నేత గాదె ఇన్నయ్య



హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): హెచ్‌సీయూ విద్యార్థుల పోరాటం వెనుక ఎవరో ఉన్నారని ఆరోపించడం మూర్ఖత్వమని, వారి వెనుక ఎవరూ లేరని, అనవసరంగా తప్పుగా మాట్లాడి ప్రభుత్వం పరువు తీసుకోవద్దని ప్రజాసంఘాల నేత గాదె ఇన్నయ్య హితవు పలికారు. హైదరాబాద్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ ఇప్పటికైనా గత అనుభవాలతో గుణపాఠం నేర్చుకోవాలని సూచించారు. యూనివర్సిటీల భూముల జోలికి వెళ్తే విద్యార్థులు ఊరుకోరని తెలిసినా, ముందుకెళ్తూ ప్రజల్లో పలుచన అవుతున్నదని చెప్పారు. కంచ గచ్చిబౌలి 400 ఎకరాల భూముల వ్యవహారంపై సీఎం రేవంత్‌రెడ్డి సహా మంత్రులు తమ నోళ్లను అదుపులో పెట్టుకొని మాట్లాడాలని, సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వం నడుచుకోవాలని సూచించారు. ఇండ్లలో మనం పెంచిన మొక్కలైనా పదేండ్లు పెరిగితే వాటిని నరకడానికి చట్ట ప్రకారం అటవీ అధికారులు అనుమతి తీసుకోవాలని చెప్పారు. హెచ్‌సీయూలోని 400 ఎకరాల భూముల్లో వృక్షాలు, జింకలు లేవని మంత్రులు చెప్పడం వారిని అవగాహన, బాధ్యతారాహిత్యానికి నిదర్శనం అని మండిపడ్డారు. రోడ్ల వెంబడి పెద్ద వృక్షాల తొలగింపు సమయంలో అటవీ అధికారుల అనుమతి తీసుకుంటారని తెలిపారు. ప్రకృతి జోలికి వెళ్తే అది మనల్నే విధ్వంసం చేస్తుందని గాదె ఇన్నయ్య హెచ్చరించారు.

### అమెరికాలో 20 వేల రెవెన్యూ ఉద్యోగాల కోత

వాషింగ్టన్: అమెరికా రెవెన్యూ విభాగంలో పని చేస్తున్న సిబ్బందిలో దాదాపు 25 శాతం మందిని తొలగించేందుకు రంగం సిద్ధమైంది. పౌర హక్కుల కార్యాలయంలోని 75 శాతం మంది ఉద్యోగులను ముందుగా తొలగించనున్నట్లు అమెరికా ఇంటర్నల్ రెవెన్యూ సర్వీస్ అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని ఈ-మెయిల్ ద్వారా సిబ్బందికి తెలియజేశామని చెప్పారు. ఫెడరల్ వర్క్‌ఫోర్స్ ఉద్యోగుల్లో ఇప్పటికే 2 లక్షల మంది తమ ఉద్యోగాలను కోల్పోయారు.

### 16 మావోయిస్టు బంకర్లు ధ్వంసం

#### జార్ఖండ్‌లో ఐఈడీలు స్వాధీనం

కొత్తగూడెం ప్రగతి మైదాన్ (నమస్తే తెలంగాణ), చాయ్‌బాసా (జార్ఖండ్): జార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భమ్ జిల్లాలో శనివారం 16 మావోయిస్టు బంకర్లను ధ్వంసం చేసి, నాలుగు శక్తిమంతమైన ఐఈడీ(ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోసివ్ డివైసెస్)ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. బబుడెర గ్రామం సమీపంలో అటవీ మార్గంలో ఈ ఐఈడీలను మావోయిస్టులు అమర్చారని చెప్పారు. వీటిని బాంబు నిర్వీర్య దళం నిర్వీర్యం చేసిందన్నారు. ఇదిలావుండగా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా శనివారం ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టు ప్రభావిత దంతెవాడ జిల్లాలో పర్యటించారు. వచ్చే ఏడాది మార్చి చివరికల్లా మావోయిస్టు రహిత దేశాన్ని నిర్మించడమే లక్ష్యమని తెలిపారు. మావోయిస్టులు అజ్ఞాతం నుంచి జన జీవన స్రవంతిలోకి రావాలని పిలుపునిచ్చారు. మావోయిస్టు రహిత గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.1 కోటి నిధులను అందజేస్తుందని చెప్పారు.

### సెక్స్ వర్కర్లను నిందితులుగా పరిగణించొద్దు

#### మధ్యప్రదేశ్ డీజీపీ ఉత్తర్వులు

భోపాల్, ఏప్రిల్ 5: హోటల్స్‌పై దాడి సందర్భంగా పట్టుబడిన మహిళా సెక్స్ వర్కర్లను నిందితులుగా పరిగణించరాదని, వారిని అరెస్టు చేయడం, వేధించడం వంటి చర్యలకు పాల్పడరాదని ఆదేశిస్తూ మధ్య ప్రదేశ్ పోలీసు శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని జిల్లాల ఎస్పీలు, భోపాల్, ఇండోర్‌లోని పోలీసు కమిషనర్లకు ఈ ఉత్తర్వు కాపీలు జారీ అయ్యాయి. హోటళ్లపై పోలీసు దాడులు నిర్వహించిన సందర్భంగా లైంగిక కార్యకలాపాలలో పాల్గొంటూ పట్టుబడిన మహిళలను నిందితులుగా పరిగణించరాదని, వారిని దోపిడీకి గురైన బాధితులుగా పరిగణించాలని మధ్య ప్రదేశ్ డీజీపీ(మహిళా రక్షణ) ప్రజ్ఞా రిచా శ్రీవాస్తవ సంతకంతో జారీ అయిన ఉత్తర్వులు పేర్కొన్నాయి. 2010లో సుప్రీంకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను ప్రస్తావిస్తూ స్వచ్ఛందంగా సెక్స్ వర్క్ చేసే వారిని వేశ్యలుగా పరిగణించరాదని డీజీపీ తెలిపారు. వేశ్య వాటికను నిర్వహించడం మాత్రమే చట్ట వ్యతిరేకమని, అక్కడ పట్టుబడిన సెక్స్ వర్కర్‌ను అరెస్టు చేయడం, శిక్షించడం లేదా వేధించడం చేయరాదని ఆమె తన ఉత్తర్వులో తెలిపారు.

# ఫ్యూచర్ సిటీకి తరలిస్తే ఉద్యమం

- భూములను హెచ్‌సీయూకు వదిలేయడమే పరిష్కారం
- కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షికి ఎన్ఎస్‌యూఐ స్పష్టీకరణ

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): హెచ్‌సీయూ భూములను యూనివర్సిటీకి వదిలేయటం తప్ప ప్రభుత్వానికి మరో ప్రత్యామ్నాయం లేదని కాంగ్రెస్ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యూఐ నేతలు మీనాక్షి నటరాజన్‌కు తేల్చి చెప్పినట్టు విశ్వసనీయంగా తెలిసింది. వర్సిటీ భూములపై వాస్తవ పరిస్థితిని ఏఐసీసీకి నివేదించడానికి నటరాజన్ శనివారం హైదరాబాద్‌కు వచ్చారు. గాంధీభవన్‌లో ఆమె వర్సిటీకి చెందిన ఎన్ఎస్‌యూఐ నేతలతో భేటీ అయ్యారు. వర్సిటీలో విద్యార్థి సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చాయని, తాము వారిని వదిలేసి పార్టీ వైపునకు రాలేమని ఎన్ఎస్‌యూఐ నేతలు తేల్చి చెప్పినట్టు తెలిసింది. ఫ్యూచర్ సిటీలో 100 ఎకరాల పరిహారం ఇచ్చి, విశ్వవిద్యాలయాన్ని అక్కడికి మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ నిర్ణయాన్ని విద్యార్థులు అంగీకరించరని, మొండిగా ముందుకుపోతే మరో ఉద్యమం తప్పదని వారు హెచ్చరించినట్టు సమాచారం.

### ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తే జైలుకు పంపుతారా?

- కేంద్రమంత్రి బండి సంజయ్



హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ తీరును వ్యతిరేకించిన యూనివర్సిటీ స్కాలర్ రోహిత్‌పై దాడి చేసి జైలుకు పంపుతారా? అని కేంద్రమంత్రి బండిసంజయ్ ప్రశ్నించారు. అక్రమంగా ఆయుధాల కేసు పెట్టి రోహిత్ జీవితాన్ని నాశనం చేస్తారా? అని మండిపడ్డారు. శనివారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఘననివాళి అర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హెచ్‌సీయూ విద్యార్థుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అమానుషంగా వ్యవహరించిందని దుయ్యబట్టారు. విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

# ఎకో పార్కుకే మీనాక్షి సమర్థన!

- మంత్రుల కమిటీ, విద్యార్థి నేతలతో సమీక్ష సమావేశం
- హెచ్‌సీయూ విద్యార్థుల్లో నెలకొన్న అయోమయం



హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): రెండువేల ఎకరాల్లో అతిపెద్ద ఎకో పార్కు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన లీకులకు అనుగుణంగానే తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అడుగులు పడుతున్నట్టు తెలుస్తున్నది. కంచ గచ్చిబౌలి భూములు తీవ్ర వివాదాస్పదంగా మారడంతో దానిపై దృష్టి పెట్టిన కాంగ్రెస్ హైకమాండ్ మీనాక్షి నటరాజన్‌ను రంగంలోకి దించింది. హైదరాబాద్‌కు శనివారం వచ్చిన మీనాక్షి నటరాజన్ హెచ్‌సీయూ భూముల వివాదంపై ప్రభుత్వం ఏర్పాటుచేసిన మంత్రివర్గ కమిటీతో పాటు కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యూఐ ముఖ్యనేతలతో భేటీ అయ్యారు. కమిటీ సభ్యులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నుంచి భూవివాదానికి సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. కంచ గచ్చిబౌలి సర్వే నంబర్ 25లోని 400 ఎకరాలు ప్రభుత్వానివేనని, ఈ భూమిపై ప్రభుత్వానికే సర్వ హక్కులు ఉన్నాయని మంత్రులు ఆమెకు వివరించినట్టు తెలిసింది. ఈ భూములతో యూనివర్సిటీకి ఎటువంటి సంబంధం లేదని వారు తేల్చి చెప్పినట్టు సమాచారం. అనంతరం ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడటానికి కాంగ్రెస్ పోరాటం చేస్తున్నదని అన్నారు. గచ్చిబౌలి భూముల వివాదంపై ఏకపక్షంగా కాకుండా అందరి వాదనలు వింటామని, ఆ తర్వాతే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఎవరికీ నష్టం జరగకుండా వివాదం పరిష్కరించాలనేది తమ ఆలోచన అని.. వర్సిటీ విద్యార్థుల లేఖలపై సమాచారం సేకరిస్తామని తెలిపారు. ఇప్పటివరకు పర్యావరణాన్ని కాపాడటానికి హెచ్‌సీయూ విద్యార్థులు తమ భవిష్యత్తునే పణంగా పెట్టి పోరాడారు. కానీ మంత్రుల కమిటీతో సమావేశం అనంతరం మాట్లాడిన మీనాక్షి విచిత్రంగా పర్యవరణాన్ని కాపాడటానికి కాంగ్రెస్ పోరాడుతుందని ప్రకటించటంతో విద్యార్థులు ఆశ్చర్యపోతున్నారు.

# హెచ్‌సీయూ వివాదం ఏఐ సృష్టే!

- మార్ఫింగ్ వీడియోలతో ద్వారా సర్కారుపై తప్పుడు ప్రచారం
- బుల్డోజర్లు, జింకలు, నెమళ్ల అరుపులు అంతా అబద్ధమే
- ఫేక్ ప్రచారంతో పాక్, చైనాతో యుద్ధాలు కూడా జరిగే ప్రమాదం
- ఫేక్ కంటెంట్‌పై విచారణకు కోర్టును అనుమతి కోరండి
- సైబర్ విభాగాన్ని అధికారులు బలోపేతం చేయాలి
- హెచ్‌సీయూపై సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు

> హెచ్‌సీయూలో బుల్డోజర్లు అబద్ధం.. జింకల పరుగులు అబద్ధం.. నెమళ్ల అరుపులు అబద్ధం.. అంతా అబద్ధం!
> - సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో ప్రభుత్వ వాదన ఇది

> ఏది అబద్ధం? యుద్ధ ట్యాంకుల్లా హెచ్‌సీయూపైకి వెళ్లిన బుల్డోజర్లు అబద్ధమా? రాత్రిళ్లు పచ్చని చెట్లను కూకటివేళ్లతో పెకిలించడం అబద్ధమా? ప్రాణ భయంతో జింకల బతుకు పరుగు అబద్ధమా? నెమళ్ల ఆర్తనాదాలు అబద్ధమా? విద్యార్థుల ఆందోళనలు అబద్ధమా? విద్యార్థులపై పోలీసుల లాఠీ దెబ్బలు అబద్ధమా? విద్యార్థులపై పెట్టిన కేసులు అబద్ధమా?
> - ఇది విద్యార్థులు, పర్యావరణ ప్రేమికుల ప్రశ్న!



హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): హెచ్‌సీయూ భూముల విషయంలో కండ్ల ముందు కనిపిస్తున్న వాస్తవాలను సైతం అసత్య ప్రచారమంటూ ప్రభుత్వం వాదించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హెచ్‌సీయూ ఘటనపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి, అక్కడ జరిగినవన్నీ అబద్ధాలే అన్న విధంగా శనివారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. అక్కడ ప్రభుత్వ తప్పేమీ లేదన్నట్టు.. తప్పంతా విద్యార్థులది, ప్రకృతి ప్రేమికులది, పశు పక్షాలదే అన్నట్టుగా సమీక్షలో ఆవేదన, ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొంగులేటి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు ఇప్పటిదాకా జరిగిందంతా ఏఐ మాయ అన్నట్టుగా సీఎం రేవంత్‌రెడ్డికి వివరించారు. మార్ఫింగ్ వీడియోలతో అసత్య ప్రచారం చేశారని చెప్పుకొచ్చారు. హైదరాబాద్ యూనివర్సిటీ భూములను లాక్కున్నట్టుగా సోషల్ మీడియా నెట్‌వర్క్ కృత్రిమంగా వివాదం సృష్టించారని ఆందోళన వ్యక్తం చేసినట్టు తెలిసింది.

### అంతా ఏఐ మాయనట!

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఉన్నవి లేనట్టు, లేనివి ఉన్నట్టుగా వీడియోలు, ఫొటోలు సృష్టించి కొందరు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయటంతో ఈ వివాదం జాతీయ స్థాయిలో చర్చకు దారి తీసిందని అధికారులు సీఎంకు వివరించారు. వాస్తవాలు వెల్లడించే లోగా అబద్ధాలు సోషల్ మీడియాలో జాతీయ స్థాయిలో వైరల్ కావటం ప్రభుత్వానికి సవాలుగా మారిందని సెలవిచ్చారు. ఏకంగా నెమళ్లు ఏడ్చినట్టుగా ఆడియోలు, బుల్డోజర్లతో జింకలు గాయపడి పరుగులు తీస్తున్నట్టుగా ఫేక్ ఫొటోలు, వీడియోలు తయారు చేశారని సీఎంకు పోలీసు అధికారులు వివరించారు. వివిధ రంగాల్లో పేరొందిన ప్రముఖులు కూడా సోషల్ మీడియాలో పోస్టులు, వీడియోలు పెట్టడంతో అబద్ధాలకు ఆజ్యం పోసినట్టయిందని తేల్చేశారు. కంచ గచ్చిబౌలిలో ఏఐ సృష్టించిన వివాదం ప్రజాస్వామ్య వ్యవస్థకే పెను సవాలు విసిరిందని అభిప్రాయపడ్డారు. ఏఐతో ఫేక్ కంటెంట్ సృష్టిస్తే భవిష్యత్తుల్లో ఇండో-పాక్, ఇండో-చైనా వివాదాలు, యుద్ధాలకు కూడా దారితీసే ప్రమాదమున్నదన్నట్టుగా చర్చించారు. ఏఐ ఫేక్ కంటెంట్ తయారీపై విచారణకు ఆదేశించేలా రాష్ట్ర ప్రభుత్వం తరఫున కోర్టుకు విజ్ఞప్తి చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో సైబర్ క్రైమ్ విభాగాన్ని బలోపేతం చేయాలని, ఏఐ ఫేక్ కంటెంట్‌ను పసిగట్టేలా అవసరమైన సాంకేతికతను సమకూర్చుకోవాలని సూచించారు.

# హెచ్‌సీయూను ఫోర్త్‌సిటీకి తరలిస్తం


- ప్రస్తుత స్థలాన్ని ఎకోపార్క్ నిర్మిస్తాం
- రేవంత్‌రెడ్డిపై రాహుల్‌గాంధీకి కోపం తెప్పించేలా పలువురి ప్రవర్తన
- కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని ప్రభుత్వం కొత్తగా నిర్మించే ఫోర్త్‌సిటీకి తరలించనున్నట్టు ఊహాగానాలు వస్తున్నాయని, ఇదే జరుగుతుందేమోనని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి ప్రభుత్వ ఉద్దేశాన్ని బయటపెట్టారు. ఈ మేరకు శనివారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం వివాదాస్పదమైన 400 ఎకరాల భూమితోపాటు యూనివర్సిటీ ఉన్న 1,500 ఎకరాల్లో ఎకోపార్క్ నిర్మిస్తామని తెలిపారు. హెచ్‌సీయూ భూ విషయంపై కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. అక్కడ జింకలు, నెమళ్లు లేకున్నా ఏఐతో మార్ఫింగ్ చేశారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై రాహుల్‌గాంధీకి కోపం తెప్పించేలా పలువురు వ్యవహరిస్తున్నారని, అలా చేయడంతో రాహుల్ గాంధీ ఇక్కడి ప్రభుత్వాన్ని డిస్టర్బ్ చేయాలని చూస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు.

# ఎకోపార్క్ ముసుగులో రేవంత్ డ్రామాలు

- హెచ్‌సీయూపై కత్తిగట్టేందుకే ఎత్తుగడలు
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్



హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూములను పెట్టుబడిదారులకు కట్టబెట్టడంలో విఫలమైన సీఎం రేవంత్ రెడ్డి.. మంత్రుల కమిటీని అడ్డంపెట్టుకొని ఎకోపార్క్ ముసుగులో కొత్త డ్రామాలకు తెరతీశారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజ్ శ్రవణ్‌కుమార్ విమర్శించారు. హెచ్‌సీయూపై కత్తిగట్టే కొత్త ఎత్తుగడలు వేస్తున్నారని శనివారం ఎక్స్ వేదికగా ధ్వజమెత్తారు. కంచ గచ్చిబౌలి భూముల్లో వన్యప్రాణులు, చెట్లు లేవంటూ నిస్సిగ్గుగా ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతీకార, మోసపూరిత ఆలోచనలతో నీచమైన ఆట ఆడుతున్నారని నిప్పులుచెరిగారు. విద్యార్థులు, పర్యావరణవేత్తల తీవ్ర నిరసనలు... సుప్రీంకోర్టు ఆదేశాలతో యూటర్న్ తీసుకొని 2,000 ఎకరాల్లో ఎకోపార్క్ ఏర్పాటు చేస్తామని ప్రకటించడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి తీరు చూస్తుంటే తుగ్లక్ పాలన గుర్తుకువస్తున్నదని ఎద్దేవా చేశారు. విద్యాశాఖను తన దగ్గరే పెట్టుకున్న రేవంత్ పాలన తెలంగాణకు శాపంగా మారిందని మండిపడ్డారు.


కళ్యాణమస్తు
..మీ జీవిత భాగస్వామి ఎంపికలో ఆత్మీయ బంధువు

శ్రీ సౌభాగ్య మ్యారేజ్ బ్యూరో



రెడ్డి వధూవరులకు ప్రత్యేకంగా చూడబడును మరియు అన్ని కులముల పెండ్లి సంబంధములకు సంప్రదించండి:
16 Year's Experience
Dr. Smt. Konala Bhagyalakshmi Reddy,
Astrologer,
Ex:Telangana Marriage Bureau Association.
H.O: షాప్ నెం.48, HMDA కాంప్లెక్స్, తార్నాక, హైదరాబాద్
B.O: Opposite Sai Baba Temple, Dilsukhnagar,
Whatsapp: 9866044439

| వధువు కావలెను | వరుడు కావలెను |
| --- | --- |
| ★బ్రాహ్మిన్స్: 31Y, 5'10", MS, SWE, USA, 150K PA, 10 Cr. Property గల వరునికి వధువు కావలెను. 9701960229 | ★బ్రాహ్మిన్స్: 25Y, 5'3", B.Tech, SWE, 7.5 Lakhs PA గల వధువుకు వరుడు కావలెను. 9701960229 |
| ★రెడ్డి: 30Y, 5'7", B.Tech, SWE, 20 Lakhs PA గల వరునికి వధువు కావలెను. 9246960888 | ★రెడ్డి: 26Y, 5'3", B.E, MS, SWE, USA, 100K PA గల వధువుకు వరుడు కావలెను. 9246960888 |
| ★యాదవ్స్: 28Y, 5'8", B.Tech, MS, SWE, 6 Lakhs PM గల వరునికి వధువు కావలెను. 9030315599 | ★మున్నూరుకాపు: 28Y, 5'3", B.Tech, SWE, 7 Lakhs PA గల వధువుకు వరుడు కావలెను. 9030315599 |
| ★పద్మశాలి: 29Y, 5'6", B.Tech, MS, SWE, USA, 110K PA గల వరునికి వధువు కావలెను. 9010051444 | ★పద్మశాలి: 28Y, 5'6", B.Tech, SWE, 15 Lakhs PA గల వధువుకు వరుడు కావలెను. 9010051444 |
| ★గౌడ్స్: 28Y, 6'0", B.Tech, SWE, 15 Lakhs PA గల వరునికి వధువు కావలెను. 7207930999 | ★గంగపుత్ర: 29Y, 5'3", B.Tech, MBA, Manager, 12 Lakhs PA గల వధువుకు వరుడు కావలెను. 7207930999 |
| ★గంగపుత్ర: 27Y, 5'7", B.Tech, SWE, 25 Lakhs PA గల వరునికి వధువు కావలెను. 9248064777 | ★ముదిరాజ్: 27Y, 5'7", B.Tech, SWE, 35,000/- PM గల వధువుకు వరుడు కావలెను. 9248064777 |
| ★ముదిరాజ్: 29Y, 5'10, B.Tech, MS, SWE, USA, 1 Cr. PA గల వరునికి వధువు కావలెను. 9701960229 | ★విశ్వబ్రాహ్మిన్: 28Y, 5'5', B.Tech, Govt. Job, 70,000/- PM గల వధువుకు వరుడు కావలెను. 9701960229 |
| ★మున్నూరుకాపు: 30Y, 6'0", B.Tech, MBA, Govt. Bank Manager, 12 Lakhs PA గల వరునికి వధువు కావలెను. 9246960888 | ★యాదవ్స్: 25Y, 5'5", CA, Tax Manager, 4.5 Lakhs గల వధువుకు వరుడు కావలెను. 9246960888 |
| ★SC మాల: 29Y, 5'9", B.Tech (IIT), SWE, 50 Lakhs PA గల వరునికి వధువు కావలెను. 9030315599 | ★నాయీబ్రాహ్మిన్స్: 30Y, 5'5", MBA, Pvt. Job, 50,000/- PM గల వధువుకు వరుడు కావలెను. 9030315599 |
| ★SC మాదిగ: 32Y, 5'9", B.Tech, SWE, 10 Lakhs PA గల వరునికి వధువు కావలెను. 9010051444 | ★SC మాల: 25Y, 5'2", B.Tech, SWE, 6 Lakhs PA గల వధువుకు వరుడు కావలెను. 9010051444 |

4 లైన్ల ప్రకటనకు 500/- (+ GST అదనం) ప్రతి అదనపు లైనుకు 125/-
9848077857